క్లుప్తంగా

'ప్రజావాణి' ఫిర్యాదులను వారంలోగా పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి మేయర్ పునుకొల్లు నీరజ సమస్యలతో కూడిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సమస్యలపై కేఎంసీ కార్యాలయానికి వచ్చిన న్యాయమైన ఫిర్యాదులను వారం రోజుల్లోగా పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం క్యూఆర్ కోడ్‌తో ఉన్న పంపు పన్ను బకాయిల నోటీసులను మేయర్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మల్లీశ్వరీ, రెవెన్యూ ఆఫీసర్ జి.శ్రీనివాస్, ఏఓ వాసుదేవ రావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం


ఆదెపు ఆంజనేయులు

ఖమ్మంరూరల్: గౌర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు సోమవారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ ఎన్నికలలో గౌర్రెల పెంపకందారుల సహకార సంఘం పోలేపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా ఆదెపు ఆంజనేయులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికకాగా.. సంఘం ఉపాధ్యక్షుడిగా మార్తి నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఆదెపు శ్రీను, డైరెక్టర్లుగా మళ్లెబోయిన లింగారావు, ఆదెపు వెంకటేశ్వర్లు, జగన్, వెంకట్రామయ్య, రూపా, రాంబాబు, కుమార్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సంఘానికి వచ్చే పథకాలను అర్హులకు వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని కామంచికల్ గ్రామపంచాయతీలో జంగం మరియమ్మ సోమవారం మృతి చెందింది. ఈమేరకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అందించిన రూ.10వేలను గ్రామ నాయకుల ద్వారా ఆ కుటుంబానికి అందించారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు 'చలో హైదరాబాద్'

తిరుమలాయపాలెం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేడు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న అన్నారు. సోమవారం పంచాయతీ కార్మికులు చలో హైదరాబాద్ వెళ్తున్నందున వారికి పర్మిషన్ ఇవ్వాలని కోరుతూ ఎంపీడీఓ జయరాంకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు ఎస్.కె పాషా, బషీర్ రవి, నాయకులు వెంకన్న, శ్రీను, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

తిరుమలాయపాలెం: ఈ నెల 25న అనారోగ్యంతో మృతిచెందిన ఆంబోతుకి సోమవారం మండలంలోని బాలాజీనగర్‌తండా పరిధిలోని రమణాతండాలో అన్నదానం నిర్వహించారు. దైవ స్వరూపంగా భావించే ఆంబోతు మృతితో గ్రామానికి అరిష్టం జరగకుండా గ్రామస్తులు పూజలు నిర్వహించి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టు పక్కల తండాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కాల భైరవునికి అభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: అష్టమి సందర్భంగా ఖమ్మం నగరంలోని సుగ్గలవారి తోటలో ఉన్న శ్రీ అన్నపూర్ణాంబ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం కాలభైరవునికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాల భైరవునికి నైవేద్యంగా గారెల దండను సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ వీవీ నర్సింహారావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పార్వతీశం కార్యక్రమాలను నిర్వహించారు.

అంధకారంలో శివాలయం

నేలకొండపల్లి: విద్యుత్ బకాయిలు చెల్లించకపోవటంతో శివాలయం విద్యుత్ కనెక్షన్ తొలిగించారు. మండల కేంద్రంలోని శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన రూ.12 వేలు విద్యుత్ బకాయిలు ఉన్నాయి. విద్యుత్ అధికారులు, సంబంధిత దేవాదాయ శాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో సోమవారం విద్యుత్ కనెక్షన్‌ను తొలిగించారు. సోమవారం సాయంత్రం ఆలయానికి వచ్చిన భక్తులు.. దేవాలయం అంధకారంలో ఉండటంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

శ్రీనివాసనగర్‌లో హై'టెన్షన్'..!


శ్రీనివాస్‌నగర్‌లో ఇళ్ల పైనుంచి వేసిన హైటెన్షన్ విద్యుత్ లైను

17వ డివిజన్‌లో ఇళ్లపైనే 11కేవీ విద్యుత్ లైను

- భయంభయంగా స్థానికుల జీవనం
- ఉరుములు, మెరుపుల సందర్భాల్లో ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- లైను మార్చాలని కాలనీవాసుల వేడుకోలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని శ్రీనివాస్‌నగర్ 17వ డివిజన్ చింతల గ్రౌండ్స్ వద్ద ఇళ్లపై నుంచి వేసిన విద్యుత్ లైను ప్రమాదకరంగా ఉంది. దశాబ్దాల క్రితం ముదిగొండ మండలంలోని పలు ప్రాంతాలకు శ్రీనివాస్‌నగర్ మీదుగా 11 కేవీ విద్యుత్ లైనును ఏర్పాటు చేశారు. కాలక్రమేణ నగరాభివృద్ధిలో భాగంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతూ.. ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములు కమర్షియల్ భూములుగా మారి ప్లాట్ల రూపంలో అమ్ముకున్నారు. విద్యుత్ లైను మార్పిడికి లక్షల రూపాయలు ఖర్చవుతుండటంతో చేసేదేమి లేక తమ ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకున్నారు. 25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం జరుగుతున్నా.. ఇంకా ఈ లైను ఉన్న ప్రాంతంలో కొన్ని ఖాళీ పాట్లు ఉన్నాయి. భవనం ఎక్కితే మొదటి అంతస్తులోనే విద్యుత్ వైర్లు చేతులకు తాకే విధంగా ఉన్నాయి. ఇళ్లతో పాటు ఖాళీ ప్లాట్ల మధ్య నుంచి విద్యుత్ స్తంభాలు వేశారు. ఈ స్తంభాలను రహదార్ల వెంటకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో ప్రమాదాలు..

వానలు, తుపానులు వచ్చిన సమయంలో ఉరుములు, మెరుపులకు ఆయా ఇళ్లలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటేనే ప్రజలు ఇళ్లలో ఉండటానికి భయపడుతున్నారు. గాలిదుమ్ములు వచ్చినప్పుడు వైర్లు ఊగుతుంటాయి. ఎక్కడ తెగి బిల్డింగ్‌లపై పడి ప్రమాదాలు జరుగుతాయోనని భయపడుతున్నారు.

ప్రమాదకరంగా జీవనం..

ఇళ్ల మధ్య నుంచి ప్రమాదకరమైన 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి తమకు తెలిసిన జాగ్రత్తలు పడుతూనే ఉన్నారు. భవనంపై విద్యుత్ లైనుకు ఆరు అడుగుల దూరం వరకు వెళ్లకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. బిల్డింగ్ పైకి ఎక్కాలంటేనే భయ పడుతున్నారు. భవనం నిర్మాణ సమయంలో కార్మికులు బిక్కుబిక్కుమంటూ పనులు చేశారని బాధితులు చెబుతున్నారు. పిల్లలు భవనంపైకి ఎక్కకుండా మెట్లపై కంచెలు వేసి ఉంచుతున్నారు.

బాధితుల అభ్యర్థనలు బుట్టదాఖలు..

33/11 కేవీ విద్యుత్ హైటెన్షన్ లైను మార్చాలని బాధిత కుటుంబాలు అనేక సార్లు విద్యుత్ శాఖ అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు అనేక సార్లు వినతి పత్రాలు, విజ్ఞప్తులు చేశారు. కాలనీకి వచ్చిన సమయంలో సమస్య పరిష్కరిస్తామని ప్రజాప్రతినిధులు వినతిపత్రాలను స్వీకరిస్తున్నారే తప్పా ఆచరణలో మాత్రం పెట్టడం లేదు. 2015లో విద్యుత్ అధికారులు లైను మార్పిడికి అవసరమైన ఎస్టిమేషన్లు(అంచనాలు) వేయిస్తామని కూడా మాటిచ్చారు. ఆ మాటలు నీటి మీద బుడగల్లాగే మిగిలాయి. ఇక స్థానిక ప్రజాప్రతినిధులు కాలయాపన చేస్తున్నారే తప్పా సమస్య పరిష్కారానికి పూనుకోవటం లేదు. విద్యుత్ శాఖ ఇప్పటికైనా లైను మార్పిడికి అంచనాలు వేసి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..



ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉంది. కాలనీకి వచ్చే ప్రజాప్రతినిధులకు సమస్యను వివరిస్తూనే ఉన్నాం. సమస్య తీవ్రతను గుర్తించి లైను మార్పిడికి అంచనాలు రూపొందించి చర్యలు తీసుకోవాలి.

– కామా సర్వయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

సమస్యపై నిర్లక్ష్యం..



దశాబ్దాలుగా సమస్య ఉన్నా సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. పట్టించుకునే నాథుడే లేడు. ఇకనైనా లైను మార్పిడికి ఎస్టిమేషన్లు వేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– మండల రంజిత్‌కుమార్, కాలనీవాసి

త్వరలో ఎస్టిమేషన్ వేయిస్తాం..

శ్రీనివాస్‌నగర్‌లో హైటెన్షన్ విద్యుత్ లైనును త్వరలో పరిశీలిస్తాం. లైను మార్పిడి అంశాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. లైను మార్పిడికి ఎస్టిమేషన్లు కూడా వేస్తాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– ఎస్.రామారావు, డీఈ విద్యుత్ ఆపరేషన్స్, ఖమ్మం టౌన్, కాలనీవాసి

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

ఖమ్మంమయూరిసెంటర్/ తిరుమలాయపాలెం/కూసుమంచి/ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ పునుకొల్లు నీరజ, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల ఎంపీపీలు బోడ మంగీలాల్, బాణోత్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. సోమవారం ఖమ్మంలో 4, 44, 21వ డివిజన్లతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను మేయర్ నీరజ సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా 44వ డివిజన్ భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బందికి స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో సేవలను గుర్తించి వారిని శాలువాతో సన్మానించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, డిప్యూటి మేయర్ ఫాతిమా జోహర, కార్పొరేటర్లు దండా జ్యోతి రెడ్డి, పాలెపు విజయ, కర్నాటి కృష్ణ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి.మల్లీశ్వరి, వైద్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఖమ్మం ఖిల్లాలో డివిజన్ కార్పొరేటర్ షౌకత్‌అలీ, తిరుమలాయపాలెం మండలం జూపెడలో ఎంపీపీ మంగీలాల్, కూసుమంచి మండలంలోని రాజుపేట, చేగొమ్మ గ్రామాల్లో ఎంపీపీ శ్రీనివాస్‌నాయక్‌కు కంటి వెలుగు కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. ఖిల్లాలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఎండీ ఇసాక్, షేక్ ఫకీనా, షాదీఖానా డైరెక్టర్ సలీంఅహ్మద్, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు. తిరుమలాయపాలెం కార్యక్రమాల్లో ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరి సర్పంచ్‌మోహినమ్మ, ఎంపీటీసీ రజిత తదితరులు పాల్గొనగా.. కూసుమంచి మండలంలో జరిగిన కార్యక్రమాల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్, సొసైటీ చైర్మన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు,సర్పంచ్‌లు అరుణ, రమణమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


తిరుమలాయపాలెం:జూపెడలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ మంగీలాల్

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న సన్నె ఉదయ్‌ప్రతాప్

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ సన్నె ఉదయ్‌ప్రతాప్ కోరారు. ఈ మేరకు సోమవారం రాత్రి స్థానిక త్రీటౌన్‌లోని 27వ డివిజన్‌లో పమ్మి అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ తెలంగాణలో అమలు చేయకపోవటం విచారకరమన్నారు. ఎన్నికల హామీలు అమలుచేయటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. త్రీటౌన్ అధ్యక్షుడు కొనతం లక్ష్మీనారాయణ, కార్యదర్శి అంకిత పాపారావు, మృత్యుంజయ, రవీందర్‌కుమార్, వీరభద్రం, దాసు, నరేష్, దాసరి రవి, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ఖమ్మంరూరల్: మోదీ పాలనకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో పది లక్షల మందితో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ తెలిపారు. సోమవారం వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని, 44 కార్మిక చట్టాలను రద్దు చేసి మూడు కోడ్‌లను తీసుకొచ్చారని వీటికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు నండ్ర ప్రసాద్, పి.మోహన్‌రావు, ఎస్.కృష్ణ, వేమన ఉపేందర్, నర్సయ్య, డి.వెంకటేశ్వర్లు, గోపి, ఏటుకూరి ప్రసాద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం పూర్తి చేయాలి

ఖమ్మంరూరల్: మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పనులు గత ఏడాది కాలంగా కొనసాగుతూనే ఉన్నాయని, అయినా పనుల్లో పురోగతి లేదని పేర్కొన్నారు. పాలకవర్గం పదవీకాలం పూర్తయిందే తప్ప పనులు మాత్రం కావడంలేదని, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్నామని చెబుతున్నా.. ఆచరణలో రైతు సంక్షేమం ఎక్కడన్నారు. అదే విధంగా మార్కెట్ నిర్మాణం కోసం అంచనా విలువ పెంచుకుంటూ పోతున్నారు కానీ ఆచరణలో పెట్టడం లేదన్నారు. ఇక్కడ మార్కెట్ నిర్మాణం పూర్తయితే పాలేరు నియోజకవర్గం రైతులతో పాటు సమీపంలోని సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి కూడా రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు అవకాశం ఉన్నందున తక్షణమే నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు.

6న దళిత కాంగ్రెస్ ధర్నా

ఖమ్మంరూరల్: దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమతను దుర్భాలాడిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, ఘటన జరిగి రోజులు గడుస్తున్నా.. ఇంత వరకు సంబంధిత వ్యక్తిపై ఎలాంటి చర్యలు లేవని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య అన్నారు. సోమవారం కోదాడ క్రాస్‌రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కనీసం మహిళా అధికారిణి అని కూడా చూడకుండా బీఆర్ఎస్ నాయకుడు ఫోన్‌లో మాట్లాడటం అటు ప్రభుత్వ ఉద్యోగులను, ఇటు మహిళలను కించపరచడమేనన్నారు. సంబంధిత వ్యక్తిపై మార్చి 5 వరకు చర్యలు తీసుకోకపోతే మార్చి 6న కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు కుమ్మరి అంబేద్కర్, ఆరెంపుల రామయ్య, మేనాల వెంకటేశ్వర్లు, గొడ్డుగొర్ల వెంకటరవి, జంగం లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామంలో వసతులు కల్పించాలి


ఖమ్మం మామిళ్లగూడెం: కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లోని వైకుంఠధామంలో కనీస వసతులు కల్పించాలని బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ.. వైకుంఠధామంలో కనీస అవసరాలైన విద్యుత్, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అలాగే ఇటీవల చెడిపోయిన విద్యుత్ మోటారు బాగు చేయించాలని కోరారు. వినతి అందించిన వారిలో కోకన్వీనర్ గుంతేటి వీరభద్రం, వెంకటరమణ, భద్రూ నాయక్, రెహమాన్, సంజీవరావు, శ్రీనివాసరావు, రామారావు, గాదర్‌బాబు, వెంకటేశ్వర్లు, రమ్య, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను ప్రారంభించాలి..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను పునఃప్రారంభించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. బస్టాండ్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రవికుమార్, రామదాసు, శ్రీకాంత్, వంశీ, అనూష, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఈ కేవైసీ తప్పనిసరి


ఆధార్ అనుసంధానం చేయిస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ

నేలకొండపల్లి: మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని కొత్త కొత్తూరు సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ సూచించారు. మండలంలోని కొత్తకొత్తూరులో సోమవారం ఉపాధి కూలీల ఆధార్ కార్డు అనుసంధానం కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సాంకేతిక సమస్యల వల్ల జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు అనుసంధానం కాకపోవటంతో కూలీలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈజీఎస్ ఏపీఓ సునీత మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా దాదాపుగా 1,000 మంది కూలీలకు సాంకేతిక సమస్యల కారణంగా అప్‌డేట్ కాలేదని పేర్కొన్నారు. అడిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి బండి నాగేంద్రబాబు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు బి.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ భారత్ మిషన్' పనులపై శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న ఏపీడీ వెంకటపతిరాజు

కామేపల్లి(కారేపల్లి): స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ రెండో భాగంలో చేయాల్సిన పనులపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కామేపల్లి రైతు వేదిక భవనంలో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా మాస్టర్ ట్రైనర్లు, ఏపీడీ వెంకటపతిరాజు, జక్రియా, అనూప్‌లు పాల్గొని శిక్షణపై అవగాహన కల్పించారు. మొదటి రోజులో భాగంగా బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటానికి చేయవలసిన అంశాలు, అమలు పరచాల్సిన విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. రెండో రోజు విలేజ్ శానిటేషన్, మూడో రోజు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రణాళికలు వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోతు సునీత, ఎంపీడీఓ పీవీఎస్ఎన్ గుప్తా, ఎంపీఓ జీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్


ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల చైర్మన్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థులు యమహా మోటార్ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై క్యాంపస్ డ్రైవ్‌లో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో కళాశాల చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ.. ఈ డ్రైవ్‌కు 130 మంది విద్యార్థులు హాజరు కాగా 20మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీఅండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, సుభాష్‌చందర్, రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌కు చెందిన విజయ మాధవి సాంస్కృతిక అకాడమీ ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించిన డ్యాన్స్ ఫెస్టివల్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులు జి.మాన్వి, కె.లక్షణ్య, ఏనుగుల వర్షలను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు అద్భుత ప్రదర్శనను ఇచ్చి ఆదియోగి పురస్కారం, జ్ఞాపిక, అభినందన పత్రం అందుకున్నారని తెలిపారు.

'శ్రీచైతన్య లోటస్'లో ఫ్యామిలీ ఫ్లోరీ సంబరాలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీచైతన్య లోటస్ పాఠశాలలో సోమవారం ఫ్యామిలీ ఫ్లోరీ సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉమ్మడి కుటుంబంలో ఉండే విలువలు, బాధ్యతలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. డీజీఎం చేతన ప్రిన్సిపాల్ శ్రీవిద్య, డీన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

'విన్‌ఫీల్డ్'లో జాతీయ సైన్స్‌డే



సైన్స్ సంబరాల్లో పాల్గొన్న పాఠశాల యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ సంబరాలను నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, పోలవరపు శ్రీకాంత్, మన్నె కిషోర్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీవీ రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్‌కు చిహ్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి తెలిపారు. క్వెస్ట్ ఫర్ టాలెంట్ అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: మధ్యప్రదేశ్‌లోని సాగర్ యూనివర్శిటీలో 1972–74లో ఎంఏ, ఎంఎస్సీ చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఖమ్మంలో నిర్వహించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు నివాసంలో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. రోజంతా అక్కడే గడిపి ఒకరినొకరు పలకరించుకుంటూ తమ జీవిత అనుభవాలను పంచుకున్నారు.

ప్రీతి మృతికి కారకులైన వారిని శిక్షించాలి

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల పీజీ మొదటి సంవత్సరం విద్యార్థిని దారావత్ ప్రీతి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ, ఏఐవైఎఫ్ సంఘాలు, బీజేపీ, కాంగ్రెస్, వైఎస్సార్‌టీపీ, ఎల్‌హెచ్‌పీఎస్, సేవాలాల్ నాయకులు, బీసీ,ఎస్టీ,ఎస్సీ,మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. పలు చోట్ల మానవహారం, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి సంతాపం తెలిపారు. నాలుగు రోజులుగా ప్రీతి మృత్యువుతో పోరాడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోలేదని దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె మృతిపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేయించాలని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రీతి కుటుంబానికి న్యాయం చేసి, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


నేలకొండపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


ఖమ్మంమయూరిసెంటర్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన మానవహారం


ఖమ్మంమయూరిసెంటర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐవైఎఫ్ నాయకులు


ఖమ్మం మామిళ్లగూడెం: జెడ్పీసెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీసీ,ఎస్టీ,ఎస్సీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక, ఎల్‌హెచ్‌పీఎస్, సేవాలాల్ నాయకులు


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు